సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



గూడు కోసం నిరుపేదల గోడు

పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో నెల రోజులకు పైగా భూ పోరాట శిబిరాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలంలో గుడారాలు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



పనుల ప్రారంభోత్సవానికి రండి

గోదావరిఖని: రామగుండంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావాలని మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయనను కలిసి ఆహ్వానించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముందుగా ఇక్కడి రైతులను ఆదుకోండి



చీమలపేటలో వరి పంటను పరిశీలిస్తున్న 'గుజ్జుల'

జూలపల్లి: దేశంలో రైతు ప్రభుత్వాన్ని తెస్తామని అంటున్న సీఎం కేసీఆర్ ముందుగా అకాలవర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ఇక్కడి రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చీమలపేటలో నష్టపోయిన పంటలను నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులు విపత్కర పరిస్థితుల్లో ఉంటే బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం ఆత్మీయ సమ్మేళనాలతో విందులు చేసుకోవడం విచారకరమని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కూసుకుంట్ల రవీందర్‌రెడ్డి, నాయకులు జ్యోతిబసు, సంకెన్ల నర్సయ్య, హన్మంతు, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఎన్టీపీసీలో ఆర్‌ఈడీ పర్యటన

- అధికారి మృతికి సంతాపం
- ఉన్నతాధికారులతో ప్రమాద స్థల పరిశీలన

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేభాశిస్ ఛటోపాధ్యాయ గురువారం పర్యటించారు. హైదరాబాద్ నుంచి టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌కు చేరుకున్న ఆయన బుధవారం ప్రాజెక్టులో జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో చనిపోయిన అధికారి జశ్వంత్ హెచ్‌ఫర్‌మార్ మృతదేహాన్ని ధన్వంతరీ ఆస్పత్రిలోని మార్చురీలో పరిశీలించి సంతాపం వ్యక్తం చేశారు. యూనిట్–2 బాయిలర్ ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాద తీరును అధికారులతో తెలుసుకున్నారు. పరిపాలనా భవనంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

'మే డే' జయప్రదం చేయండి



కరపత్రం విడుదల చేస్తున్న ముత్యం రావు

కాల్వశ్రీరాంపూర్: మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు కోరారు. మండలకేంద్రంలో మేడే ఉత్సవాల కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. పని గంటల కోసం పోరాటం చేసి అమరులైన కార్మికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రాజేందర్, నాయకులు దొడ్డ రాజబాబు, రాగమల్ల సురేశ్, అంబాల లక్ష్మణ్, మహేశ్, గౌసుద్దీన్, లక్ష్మినర్సు, లత, మధునయ్య పాల్గొన్నారు.

ఇటుకబట్టీలో వలస కూలీలకు విముక్తి



రంగాపూర్ ఇటుకబట్టీ నుంచి పంపిస్తున్న సీఐడీ అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని రాజరాజేశ్వర ఇటుకబట్టీలో పనిచేస్తున్న 29 మంది వలస (ఒడిశా) కూలీలకు సీఐడీ అధికారులు విముక్తి కల్పించారు. 11మంది పురుషులు, 10మంది ఆడవారు, ఎనిమిది మంది పిల్లలు ఉన్నారని బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. ఇటుకబట్టీల్లో వారు పడుతున్న ఇబ్బందులను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న సీఐడీ ఉన్నతాధికారులు గురువారం స్థానిక అధికారులతో కలిసి వారిని స్వస్థలాలకు పంపించారు. తేరాజ్‌మాంజీ, జగదీశ్ పాణిగ్రహీ, మగనాద్‌తండీ, ధయానాదోడ్స్, ధాల్‌సింగ్, పూర్ణవోగ్, ధిగంపటేల్, జలంధర్ నాగ్, సాధస్‌హన్స్, మనోజ్‌బోరియా, టింకూ బోరియా, నీలా, చంద్రబటీమాంజీ, దమయంతి, సజాతండీ, ప్రమీలనాగ్, జమానాగ్, సీమాంజలి, చిన్నభాయ్‌యాదవ్, కుంతలపాణిగ్రహీ, లక్ష్మిబోరియా, చిన్నారులు మోహన్‌లాన్స్, టికేమణి, అంకితజగత్, లలితపటేల్, బెనుదర్, ముంజేష్‌నాగ్, సాగర్, రోజిబోరియా ఉన్నారని అధికారులు తెలిపారు.

కోద్దామా.. వద్దా..!?

- వర్షానికి రాలిపోయిన వరి గింజలు
- మిగిలింది గడ్డి మాత్రమే..
- కోస్తే.. మిషన్ డబ్బులూ రాని వైనం
- జిల్లా రైతన్న వెన్నువిరిచిన వడగండ్ల వాన..



సర్వం కోల్పోయాడు

ఈ రైతు పేరు గట్ల శ్రీనివాసరెడ్డి. ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేట గ్రామం. యాసంగిలో తన సొంత నాలుగెకరాలతోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని మొత్తం ఎనిమిదెకరాల్లో వరి సాగుచేసాడు. పంట చేతికి వచ్చే దశలో వడగండ్ల వాన కురిసి వరి గింజలు పూర్తిగా నేలరాలాయి. వరి గడ్డి మాత్రమే మిగిలింది. కౌలుతోపాటు పెట్టుబడికి రూ.మూడు లక్షల వరకు అయింది. ఉన్న గడ్డిని హార్వెస్టర్‌తో కోయించాలన్నా రూ.వేలు ఖర్చవుతుంది. అందుకే పొలాన్ని వదిలిపెట్టి ప్రభుత్వం స్పందించాలని కంటతడి పెడుతున్నాడు.



గింజలన్నీ రాలాయి..

తొమ్మిదెకరాలు వరి సాగు చేసిన. రూ.2.25 లక్షలకు పైగా పెట్టుబడి అయ్యింది. ఈదురుగాలులు, భారీవర్షం.. రాళ్లు పడి వరి గింజలు పూర్తిగా రాలిపోయాయి. హార్వెస్టర్‌కు ఇచ్చే పైసలు కూడా రాలేదు. నిండా మునిగాం. ప్రభుత్వం ఆదుకోవాలి.
– నర్సింహారెడ్డి రైతు, బుర్హాన్‌మియాపేట



గింజలు రాలిపోయి గడ్డి మాత్రమే కనిపిస్తున్న పొలం



రాలిపోయిన వరి గంజలు

సాక్షి, పెద్దపల్లి/ఎలిగేడు: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతన్నకు అడుగడుగునా కష్టనష్టాలు తప్పడం లేదు. జిల్లాలో ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటున్నాయి. వానాకాలం, యాసంగి.. ఇలా సీజన్ ఏదైనా పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి పగబట్టినట్లు చేస్తోంది. తాజాగా నెలరోజుల వ్యవధిలో మూడుసార్లు కురిసిన వడగండ్ల వానలతో రైతన్న కుదేలయ్యాడు. వడగండ్ల వానతో పొలంలోనే వరిగింజలు రాలిపోయి గడ్డే మిగిలింది. ఆ పొలాన్ని కోస్తే మిషన్‌కు కూడా డబ్బులు రాని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వరిని కోయాలా..? వద్దా..? అనే సందిగ్ధంలో రైతులు పడిపోయారు. ఒకవేళ కోసినా.. మళ్లీ వర్షం వచ్చే సూచనలు ఉండడం రైతులను మరింత అయోమయానికి గురిచేస్తోంది. కోసిన ధాన్యాన్ని కూడా ఆరబోసుకునే పరిస్థితి లేదని, ఉదయం తీవ్రమైన ఎండ.. సాయంత్రం కాగానే ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుండటంతో ఏం చేయలో తెలియక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

బుర్హాన్‌మియాపేటలోనే అధిక నష్టం..

ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేటపై ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్రజేసింది. విపత్తుధాటికి గ్రామంలోని పంటలన్నీ ఊడ్చుకుపోయాయి. గ్రామంలో సుమారు 850 ఎకరాల్లో వరి పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేలవాలడంతో అదనపు ఖర్చు

వడగండ్ల వానతో చాలాప్రాంతాల్లో చేతికొచ్చిన పంట నేలవాలింది. దీంతో యంత్రంతో కోతలు చేయటం చాలా కష్టంగా మారింది. గంటలో కోత పూర్తయ్యే పొలానికి రెండుమూడు గంటల సమయం పడుతుంది. ఇలా రైతులపై ఆర్థిక భారం పడే అవకాశముంది. దీంతో చాలామంది రైతులు పొలాన్ని కోయకుండానే పశువులకు మేతకోసం వదిలిపెట్టాలని చూస్తున్నారు.

11 ఎకరాలు పోయింది



11 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేసిన. రూ.3 లక్షల అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టిన. వడగండ్ల వర్షాలకు పూర్తిగా పోయింది. వరి కోసే పరిస్థితి లేదు. ఏంచేయాలో దిక్కు తోచడం లేదు. కౌలు డబ్బులు ఎలా చెల్లించాలో అర్థంకావడం లేదు. ఉన్న వరిని కోయిద్దామన్నా హార్వెస్టర్ ఖరీదు రాని పరిస్థితి ఉంది.
– పుల్యాల రాజిరెడ్డి, రైతు, బుర్హాన్‌మియాపేట

పెట్టుబడి నేలపాలైంది



వర్షాలు పడడంతో పొలంలో వడ్లు అలికినట్టు రాలినయి. ఐదెకరాలు వరి వేసిన. సగం కోసినంక వర్షం వచ్చింది. మిగితా సగం పంట పొలంలోనే గింజలు రాలిపోయాయి. పెట్టిన పెట్టుబడి నేలపాలైంది. మిగిలిన వరి పొలం మిషన్ పెట్టి కోసిన మిషన్ ఖర్చులు సైతం వచ్చేలా లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి.
– అసంశెట్టి రామయ్య, ఓదెల

మిగిలింది గడ్డే..



నాకున్న ఆరెకరాల్లో సీడ్ వరి సాగు చేశాను. ఎకరాకు రూ.20వేల చొప్పున పెట్టుబడి పెట్టిన. వర్షాలకు వరంతా నేలవాలింది. వడగండ్లతో గింజలు మొత్తం రాలిపోయాయి. ఇప్పుడు వాటిని మిషన్ పెట్టి కోయించినా మిగిలేది గడ్డే మాత్రమే.
– పొన్నం శంకరయ్య, ఓదెల

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



ప్రైవేట్ ఆసుపత్రులు ల్యాబ్‌ల్లో తనిఖీలు చేస్తున్న వైద్యాధికారులు

పెద్దపల్లిరూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమని, ఒకవేళ చేసినట్టు రుజువైతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వైద్య శాఖ అధికారులు వెంకటేశ్వర్లు, డోరకమ్మ అన్నారు. పెద్దపల్లిలోని పలు ప్రసూతి కేంద్రాలు, లాబోరేటరీల్లో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నర్సింగ్‌హోమ్‌లకు వచ్చే గర్భిణులు, వారి బంధువులకు కౌన్సెలి ంగ్ ఇవ్వాలని సూచించారు. అధికారులు సా లమ్మ, స్టాటిస్టికల్ ఆఫీసర్ తదితరులున్నారు.

మే ఒకటి నుంచి క్రీడాశిక్షణ శిబిరాలు

పెద్దపల్లిరూరల్: జిల్లా యువజన క్రీడాసాధికారిత సంస్థ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ నుంచి జిల్లాలోని 10 గ్రామాల్లో క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16 గ్రామాల నుంచి అభ్యర్థనలు రాగా.. గ్రామీణ ప్రాంతాల నుంచి 10 గ్రామాలను ఎంపిక చేశామన్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్, అప్పన్నపేట, కాల్వశ్రీరాంపూర్‌లో వెన్నంపల్లి, కాలవ్రశ్రీరాంపూర్, ధర్మారంలో నందిమేడారం, జూలపల్లిలో వడ్కాపూర్, జూలపల్లి, సుల్తానాబాద్‌లో రేగడిమద్దికుంట, ఎక్లాస్‌పూర్, అంతర్గాంలో శిబిరాలు ఉంటాయన్నారు. 16ఏళ్లలోపు బాలబాలికలు సంబంధిత శిక్షకుల వద్ద ఈనెల 30 లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రైతులను ఆదుకోండి

పెద్దపల్లిరూరల్: అకాలవర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరి హారం అందించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, సురేశ్‌రెడ్డి కోరారు. గురువారం కలెక్టర్ సంగీతను కలిసి వినతిపత్రం అంది ంచారు. ఎకరాకు రూ.50వేల చొప్పున ప రిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. నా యకులు మల్లికార్జున్, సునిల్‌రెడ్డి, సంతోష్, రా జేశ్వర్‌రావు, సంపత్‌రావు, దిలీప్, శ్రీకాంత్, కిరణ్, సదానందం, అన్వేష్ తదితరులున్నారు.

హరితహారంపై శ్రద్ధ చూపండి



భగీరథకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో హరితహారం కింద మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించడంలో అధికారులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ సంగీత అన్నారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. గ్రామాలు, మండలాలవారీగా చెరువులు, కుంటలు, కాలువల వద్ద హద్దులను నిర్ణయించి మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూమిని నిర్ధారించి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్డీఓ వెంకటమాధవరావు, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఎఫ్‌ఓ శివయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భగీరథ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భగీరథుడు మహాజ్ఞాని అన్నారు. బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, నగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఉన్నారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే హాల్ టికెట్లను విడుదల చేశామని, హాల్ టికెట్ డౌన్‌లోడ్ కానివారు శుక్రవారంలోగా నవోదయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పద్నాలుగు బ్లాకుల పరిధిలో ఏర్పాటు చేసిన 37 పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తామని, 7,730 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 29న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్ లేకుండా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని.. అభ్యర్థులంతా ఉదయం 10.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలకు అనుమతిలేదని పేర్కొన్నారు.



కలెక్టరేట్ ఎదుట జూ.పంచాయతీ కార్యదర్శుల నిరసన

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. అంతకుముందు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నియామకం సమయంలో మూడేళ్ల కాలపరిమితితో ఇచ్చిన ఉత్తర్వుల గడువు ముగిసిందని సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ తెలిపారు. ఉద్యోగాలకు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు శుక్రవారం నుంచి సమ్మెకు దిగుతామని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

జీపీఎఫ్ బకాయిలు రూ.28 కోట్లు

- ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ గోస
- తొమ్మిది నెలలుగా బిల్లులకు మోక్షం లేదు
- నిలిచిపోయిన జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్స్, పార్టు ఫైనల్ లోన్స్, అడ్వాన్సులు



జెడ్పీ కార్యాలయం

పార్ట్ ఫైనల్ రూ.18,99,40,000
ఫైనల్ పేమెంట్స్ (స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మికంగా మృతి చెందినవారివి) రూ.7,40,11,000
అడ్వాన్సులు రూ.1,60,49,000
రావాల్సిన బకాయిలు మొత్తం రూ. 28 కోట్లు

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, వరంగల్ అర్బన్, భూపాలపల్లి జిల్లాలోని 71 మండలాల్లో 12 వేల మందికిపైగా ఉపాధ్యాయులు విద్యాశాఖలో పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) విభాగం నుంచి పదవీ విరమణ పొందిన సమయంలో వీరి పెన్షన్ డబ్బులతో పాటు ఇతరత్రా సదుపాయాలు పొందే వీలుంటుంది. పనిచేస్తున్న ఉపాధ్యాయులు వారి సర్వీసును బట్టి తాము దాచుకున్న డబ్బులు అవసరాల కోసం తీసుకోవచ్చు. ఇల్లు రిపేరు, పిల్లల చదువులు, పెళ్ళిళ్లు, ఆరోగ్య రీత్యా ఎదురయ్యే సమస్యలకు జీపీఎఫ్ విభాగం నుంచి డబ్బులు పొందే వీలుంది. కానీ.. జిల్లా పరిషత్ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తాము అవసరాల కోసం దాచుకున్న డబ్బుల కోసం వేలాది మంది ఉపాధ్యాయులు జిల్లా పరిషత్‌లోని జీపీఎఫ్ విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గతంలో పలు మార్లు ధర్నాలు నిర్వహించి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా మార్పు రాలేదు. ఈ విద్యా సంవత్సరం కూడా ఉపాధ్యాయులు తాము దాచుకున్న డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. తమ ప్రమేయం ఏమీ లేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో జీపీఎఫ్ విభాగంలో ఏటా ఇదే తంతు జరుగుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు.

బకాయిలు ఇలా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి బకాయిలు రూ.28 కోట్ల పైబడి ఉంటాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జీపీఎఫ్ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై జీపీఎఫ్ విభాగం సూపరింటెండెంట్‌ను సాక్షి వివరణ కోరగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి వివిధ రకాల బిల్లులు 243 మంది ఉపాధ్యాయుల పార్ట్‌ఫైనల్, అడ్వాన్సులకు సంబంధించి దాదాపు 28 కోట్ల రూపాయలు చెక్కుల రాసినట్లు చెప్పారు. వాటిని ఆర్థిక శాఖ క్లియరెన్స్‌కు పంపామని.. ఈ–కుబేర్ విధానంతో వల్ల జాప్యం అవుతోందని.. అది ప్రభుత్వ పరిధిలోని అంశమని సమాధానమిచ్చారు.

- ➡ భార్యభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులే. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని మల్యాల మండలంలో భర్త పనిచేస్తుండగా.. ఆయన భార్య ధర్మారం మండలంలో పనిచేస్తున్నారు. వారి గ్రామంలో భూమి కొనుగోలు కోసం సెప్టెంబర్‌లో క్రయవిక్రయ ఒప్పందం జరిగింది. ఇరువురు జిల్లా పరిషత్‌లో వారి జీపీఎఫ్ ఖాతాల్లో సొంత డబ్బును రూ.15 లక్షల లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆరు నెలలుగా వారికి రావాల్సిన లోన్ రావడం లేదు. దీంతో జడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.'
- ➡ గంగాధర మండల కేంద్రానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆరోగ్య రీత్యా అవసరం ఏర్పడి కొంత మేరకు లోన్ కావాలని దరఖాస్తు సమర్పించారు. ఐదు నెలలు గడుస్తున్నా లోన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు'.
- ➡ 'చొప్పదండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందారు. ఆయనకు రావాల్సిన బకాయిల కోసం అక్టోబర్‌లో దరఖాస్తులు సమర్పించారు. నేటికీ పెన్షన్, ఇతరత్రా డబ్బుల కోసం జడ్పీ జీపీఎఫ్ విభాగంలో వాకబు చేస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు డబ్బులు అందలేదు'.
- ➡ ఇలా తొమ్మిది నెలలుగా లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఎందరో జీపీఎఫ్ డబ్బుల కోసం కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు.

ఇది ఇలా ఒకరిద్దరి ఉపాధ్యాయుల బాధ కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొమ్మిది నెలలుగా వివిధ లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల వెతలు

పెండింగ్ బిల్లులన్నీ సకాలంలో చెల్లించాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మికంగా మృతిచెందిన వారికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా మానసికక్షోభకు గురిచేయడం తగదు. ఉపాధ్యాయులు తాము దాచుకున్న జీపీఎఫ్ విభాగం నుంచి అత్యవసర నిమిత్తం డబ్బులు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కాలరాయడం భావ్యం కాదు. తొమ్మిది నెలలుగా 400 మందికిపైగా ఉపాధ్యాయులకు మంజూరై ఉన్న రూ.28 కోట్ల డబ్బులను వెంటనే చెల్లించాలి.
– తూముల తిరుపతి, డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

ఆసుపత్రి భవనం పైనుంచి పడి వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం: ప్రమాదవశాత్తు ఓ ఆసుపత్రి భవనం పైనుంచి పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం రాగినేడుకు చెందిన బొజ్జ సమ్మయ్య(64)కంటి చూపు సమస్యతో ఈనెల 24న ఓ ఆసుపత్రిలో చేరగా వైద్యులు ఓ కంటికి ఆపరేషన్ చేసి మరో కంటికి పరీక్ష చేయాల్సి ఉన్నారు. 26న రాత్రి 11 గంటలకు ఆసుపత్రి భవనంపైకి ఎక్కి కిందపడ్డాడు. ఉదయం సమ్మయ్య భార్య భూదేవి లేచిచూడగా కింద గాయపడి కనిపించాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జూలపల్లి(పెద్దపల్లి): మహిళా ప్రజాప్రతినిధులను చులకన భావంతో చూస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జూలపల్లి ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని మహిళా ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షురాలు, జూలపల్లి ఎంపీటీసీ అమరగాని మమత కలెక్టర్, జెడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు మమత పేర్కొన్నారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని పెద్దాపూర్‌లో పలువురు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లను బుధవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రాజన్నల ఎల్లయ్య, కచ్చు మల్లయ్య వ్యవసాయ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గతంలో కూడా మోటార్లను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. కాలువలు, వాగుల వద్ద పెట్టిన కరెంటు మోటార్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ఆట కట్టించాలని పోలీసులను రైతులు కోరుతున్నారు.

గూడు కోసం నిరుపేదల గోడు



‘ఈ ఫొటోలోని మహిళ పేరు మల్లిక. భర్తతో పాటు కూలీ పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో జీవనం కొనసాగిస్తున్నారు. రోజంతా పని చేసినా ఇంటికి వస్తువుల కొనుగోలుకు ఖర్చు అవుతున్నాయని, ఇంటి అద్దెలు చెల్లించలేక పిల్లల పోషణకు ఇబ్బంది కావడంతో అప్పు చేయాల్సిన వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేస్తే తమకు కొంత ఆర్థికంగా ఊరట లభిస్తుందని చాలా సార్లు దరఖాస్తు చేసుకున్నారు. కాని ఎలాంటి ఫలితం లేకపోవడంతో సీపీఎం భూపోరాట శిబిరంలో గుడారం వేసుకుని ఇద్దరు పిల్లలతో నిరసన కార్యక్రమంలో పాల్గొంది. ఇలాంటి నిరుపేదలు చాలా మంది గూడు కోసం నెల రోజులకు పైగా గుడారాల వద్ద ఉంటూ నిరసన తెలుపుతున్నారు’.



ఇందిరమ్మకాలనీలో గుడారాలు వేసుకున్న పేదలు

- నెలరోజులుగా గుడారాల్లో ఉంటూ నిరసన
- స్థలాలు కేటాయించాలని నిత్య పోరాటం
- ఖాళీ చేయాలంటున్న రెవెన్యూ అధికారులు

జ్యోతినగర్(రామగుండం): పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో నెల రోజులకు పైగా భూ పోరాట శిబిరాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలంలో గుడారాలు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా పేదలకు ఇళ్ల కేటాయించాలని స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. దీంతో అధికార పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ బినామీలతో స్థలాల విక్రయాలు, అక్రమ కట్టడాలు చేస్తున్నారని సీపీఎం జిల్లా నాయకులు ఆరోపించారు. ఈ క్రమంలో అధికార యంత్రాగం విచారణ చేపట్టి శ్రీనివాస్ అనే వ్యక్తిని బైండోవర్ చేయడంతో పాటు అతడి అక్రమ కట్టడం కూల్చివేయాలని లిఖిత పూర్వకంగా పత్రాలు తీసుకుని వదిలివేశారు. మరో ఏడుగురిపై పలు ఆరోపణలు ఉన్నాయని, వారిపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇందిరమ్మకాలనీలో ఇలా..

రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లో పేదల కోసం కేటాయించిన ఇందిరమ్మ నివాస స్థలాలు ధనికుల చేతుల్లోకి వెళ్లి ఖరీదైన భవంతులు వెలుస్తున్నాయి. 2008 నుంచి ఇప్పటివరకు అధికారికంగా 6,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు సమాచారం. మంజూరైన ఇళ్లలో సుమారు 500 మంది మాత్రమే లబ్ధిదారులు నివాసముంటున్నారు. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కొందరు ఈ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆజమాయిషిలోకి తెచ్చుకుని వ్యాపార కేంద్రంగా మలుచుకుని గతంలో పేదవారుగా ఉన్నవారు నేడు ధనవంతులుగా మారిపోయారు. సొంతంగా పట్టా ఉన్నవారి ప్లాట్లను ఆక్రమించడం సర్వసాధారణంగా మారింది. అసలైన లబ్ధిదారులు తమకు ప్రభుత్వం ఇచ్చిన డబ్బు, తాము పోగుచేసుకున్న డబ్బుతో అరకొరగా ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు.

వంద ఫీట్ల రోడ్డు కబ్జా

ఇందిరమ్మకాలనీలో 100 ఫీట్ల రోడ్డు నిర్మించేందుకు వీలుగా ప్లాట్లను ఏర్పాటు చేసి గతంలో అందించారు. ప్రస్తుతం ఆ రోడ్డు ఏర్పాటు కాకపోవడంతో 30 ఫీట్లు రోడ్డు వదిలి ఇరువైపులా మిగిలిపోతున్న 35 ఫీట్ల చొప్పున ఉన్న భూమిని కూడా కాజేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రెవెన్యూ అధికారులు ఐదేళ్ల క్రితం ఇందిరమ్మకాలనీలో ఎవరు నివసిస్తున్నారు, స్థలాలు ఎవరి పేరుమీద ఉన్నాయని సర్వే చేశారు. సర్వే పూర్తి చేయకపోవడం దళారులకు వరంగా మారింది. పూర్తిస్థాయిలో సర్వే చేస్తేనే బినామీగా ఉన్నవారు ఎందరు, లబ్ధిదారులు ఎవరనే విషయాలు వెలుగులోకి రానున్నాయి.

డబుల్ బెడ్‌రూం మంజూరు చేయండి



మేము చాలా ఏళ్లుగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. అద్దె ఇంట్లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాము. ప్రభుత్వం మాకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలి.

– మహాలక్ష్మి, ఎన్టీపీసీ రామగుండం

ఇల్లు లేదు, ఇంటి స్థలం లేదు



మాకు ఇల్లు లేదు, ఇంటి స్థలం లేదు. కూలీ పనులు చేస్తేనే ఇల్లు గడుస్తుంది. ప్రభుత్వం ఇల్లు కేటాయించి ఆదుకోవాలి. చాలా మంది ధనవంతులు కూడా ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టుకున్నారు. అధికారులు మాకు ఇల్లు కేటాయించాలని వేడుకుంటున్నాం.

– భాగ్య, అన్నపూర్ణకాలనీ

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు..



ఇందిరమ్మకాలనీలోని ప్రభుత్వ భూమిలో గుడారాలు వేసుకున్న వారు వెంటనే ఖాళీ చేయాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు ఇళ్ల స్థలాల కేటాయింపు జరుగుతుంది. ఇష్టారాజ్యంగా గుడారాలు వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయి. ఆక్రమణదారులపై కూడా కేసులు నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ చేశాం. అర్హుల దరఖాస్తులను కలెక్టర్‌కు పంపిస్తాం. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా కఠినచర్యలు తీసుకుంటాం. – జాహెద్‌పాషా, తహసీల్దార్, రామగుండం

రైల్వే ప్లాట్‌ఫారంపై తెరుచుకున్న స్టాల్



ఓపెన్ చేసి ఉన్న స్టాల్

సాక్షి ఎఫెక్ట్..

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాల కల్పనలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఈ నేపథ్యంలో ఈనెల 24న సాక్షి దినపత్రికలో ‘రైల్వేస్టేషన్ పెద్దదే.. అన్నీ సమస్యలే’అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారంపై స్టాల్ ఓపెన్ చేయడంతో ప్రయాణికులు కనీస అవసరాలు తీర్చుకునేందుకు అనుకూలమైంది. ఈసందర్భంగా ‘సాక్షి’ కథనంపై పలువురు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ యు.ఉపేందర్‌ను మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. జైపూర్ స్టేషన్‌లో పనిచేస్తున్న కె.రామక్రిష్ణను మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ విభాగానికి, కాలశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న జి.రాజవర్ధన్‌ను మంచిర్యాల జిల్లా భీమారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎం.కమలాకర్‌ను సీఎస్‌బీ రామగుండం, భీమారం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న జి.సుధాకర్‌ను సీసీఎస్ మంచిర్యాలకు బదిలీ చేశారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

- బీజేపీని గద్దె దించేవరకూ ఉద్యమం
- తప్పు చేస్తే రాష్ట్ర ప్రభుత్వాన్నీ సహించేది లేదు
- మే 15 నుంచి ఇంటింటికీ సీపీఐ
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి
- సుల్తానాబాద్‌లో ముగిసిన ప్రజా చైతన్య యాత్ర



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

సుల్తానాబాద్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర గురువారం రాత్రి సుల్తానాబాద్‌లో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న పోరుయాత్ర హైదరాబాద్‌లో ప్రారంభమై కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లోని 70 మండలాల్లో పూర్తి చేశామన్నారు. మే 15 నుంచి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మే 15న హుస్నాబాద్, 17న మానకొండూరు నియోజకవర్గంలో ఉంటుందన్నారు. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రప్రభుత్వం మాట తప్పిందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్ముతోందని పేర్కొన్నారు. అదాని కంపెనీలపై పార్లమెంట్‌లో కమిటీ వేయడానికి ప్రధాని సాహసించలేదన్నారు. కేంద్రం కుట్రను తిప్పికొట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముస్లింల రిజర్వేషన్ తీసేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం మాట వినని రాష్ట్ర ప్రభుత్వాలపై ఈడీతో దాడులు చేయిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులు, పెన్షన్, నిరుద్యోగ భృతి ఇవ్వాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వం తప్పు చేస్తే ఎండగడతామన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, మంథని రమేశ్ సీపీఐ నాయకులను సన్మానించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కలవేన శంకర్, వివిధ జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, పవన్, సురేశ్, వేణు, మోహన్, గౌతమ్ గోవర్ధన్, పల్లె నరసింహ, కడారి సునీల్, తాళ్లపల్లి లక్ష్మణ్, మల్లయ్య, కనకరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, లెనిన్, రాష్ట్ర కార్యదర్శి బాలసాని లెనిన్, ప్రేమ్ ఉన్నారు.

విభజన హామీలు నెరవేర్చాలి..

మంథని: రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చాడ డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య బస్సుయాత్రలో భాగంగా మంథనిలో మాట్లాడారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. నాయకులుకొవ్వూరి రాజలింగు, రౌతు మల్లయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం లక్ష్మీనారాయణ ఉన్నారు.

బస్సుయాత్రకు స్పందన

కాల్వశ్రీరాంపూర్: చాడ చేపట్టిన బస్సు యాత్రకు కాల్వశ్రీరాంపూర్‌లో స్పందన వచ్చింది. జీఎస్టీ పేరిట పేదల సొమ్మును వసూలు చేస్తున్న ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దళితులకు మూడెకరాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. మహిళా సమైఖ్య నాయకురాలు గూడెం లక్ష్మి, మల్లవ్వ, పద్మ, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మండలకేంద్రంలో చాడ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. పార్టీ మండల కార్యదర్శి కందుకూరి రాజరత్నం పాల్గొన్నారు.

బీజేపీని గద్దెదించే వరకూ పోరాటం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో చాడ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దెదింపాలన్నారు. పార్టీ జిల్లా కౌన్సిల్ ఎల్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరందించాలి



రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరందించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ కోరారు. గురువారం సింగరేణిభవన్‌లో సంస్థ సీఅండ్ఎండీని శ్రీధర్‌ను కలిసి జిల్లాలోని సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పారిశ్రామిక ప్రాంతంలో ముస్లింల ప్రార్థన కోసం ఈద్గావద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. జీడీకే–5 ఓసీపీకి సంబంధించి ఓబీ డంప్ యార్డ్ నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల ప్రార్థనలు, అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్మిక క్షేత్రమైన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్జీ–1,2,3 ఏరియాలలో నివసించే సింగరేణి కార్మిక కుటుంబాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ల ఏర్పాటు కోసం రూ.20 కోట్ల నిధులను మంజూరు చేయడంపై అభినందనలు తెలిపారు. త్వరగా వీటిని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకోవాలన్నారు.

రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



క్వారీని పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

గోదావరిఖని(రామగుండం): రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. గురువారం జీడీకే–5 ఓసీపీని సందర్శించారు. వ్యూపాయింట్ ద్వారా క్వారీల అసాంతం పరిశీలించారు. దుమ్ము లేవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అండర్‌గ్రౌండ్ గ్యాలరీ ప్రాంతాల్లో పనులు జరుగుతున్న క్రమంలో భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రణాళికల గురించి సూచనలు, సలహాలు అందజేశారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాకు సంబంధించి వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. దుమ్ము లేవకుండా ఎప్పటికప్పుడు వాటర్ స్ప్రేయింగ్ చేయాలన్నారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, కాలరీ మేనేజర్ అనిల్‌గబాలే తదితరులున్నారు.

అన్ని సంఘాలను చర్చలకు పిలవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేంతవరకు అన్ని సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జీడీకే–2వ గనిపై మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. సింగరేణిలో ఎన్నికలు జరిగి దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా ఎన్నికల ఊసేలేదన్నారు. ఎన్నికలు నిర్వహించకపోగా కాలపరిమితి పూర్తయిన గుర్తింపు కార్మిక సంఘాన్ని యాజమాన్యం అనధికారంగా చర్చలకు పిలుస్తోందన్నారు. మిగతా యూనియన్లకు కార్మికుల సమస్యలపై మాట్లాడే కనీస హక్కును కూడా నిరాకరిస్తుందన్నారు. ఎన్నికలు నిర్వహించేవరకు అన్ని సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగు శ్రీను, ఎస్.వెంకట్‌రెడ్డి, గుండేటి శ్రీనివాస్, అన్వేష్, సంపత్, మోతె రాజయ్య, కొమురయ్య, మణికంఠ, వెంకటస్వామి, కారం సత్తయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): పర్సనల్ విభాగంలో ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ ఆదేశించారు. గురువారం ఏరియాలోని పర్సనల్ విభాగంతో పాటు అన్ని డిపార్ట్‌మెంట్ల ముఖ్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డైరెక్టర్(పా) దిశానిర్దేశం ప్రకారం ప్రతీ అధికారి ముందుకు సాగాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, సీఎంపీఎఫ్, హెచ్‌బీఎల్ఆర్ఎస్, మెడికల్ కార్డులు, నాణ్యమైన అల్పాహారం అందించేలా క్యాంటీన్లను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తుండాలని సూచించారు. క్వార్టర్ల కేటాయింపుపై కౌన్సెలింగ్ ప్రతినెలా నిర్వహించాలన్నారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ సమయంలో పేర్లు పంపించేటప్పుడు కచ్చితంగా నిబంధనల ప్రకారం అన్ని రకాల డాక్యుమెంట్లు పరిశీలనలు జరిపి ప్రతిపాదించాలన్నారు. నామినేషన్ ఫారాలను పూర్తి చేయించడం, ఏరియాలో కార్మికుల బ్యాంకు ఖాతాలను కార్పొరేట్ శాలరీ ప్యాకేజీగా మార్చేందుకు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటిలో గ్రాడ్యుయేషన్ ‘డే’





పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి ప్రైమరీ పాఠశాలలో గురువారం కిండర్‌గార్డెన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాధులనూ ఆక్రమిస్తారా..?

- ఏళ్ల తరబడి అక్కడే ఖననం చేస్తున్నం
- ఇప్పుడు కూలగొట్టి చదును చేయడమేంటి..?
- చర్యలు తీసుకోవాలని దళిత కుటుంబాల వినతి



నిరసన తెలుపుతున్న దళితకుటుంబాలు

సుల్తానాబాద్: తమ బంధువుల్లో ఎవరు చనిపోయినా ఏళ్ల తరబడి ఇక్కడే సమాధి చేస్తున్నామని, ఇప్పుడు ఆ స్థలంలోని సమాధులు తొలగించి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారని సుగ్లాంపల్లికి చెందిన కొన్ని దళిత కుటుంబాలు నిరసనకు దిగాయి. వారి కథనం ప్రకారం.. సర్వే నంబర్ 487లో కొంత స్థలంలో సుగ్లాంపల్లికి చెందిన దళితులు ఎవరు చనిపోయినా అక్కడే ఖననం చేస్తున్నారు. 90 ఏళ్లుగా ఆ స్థలంలోనే సమాధులు కడుతున్నారు. తాజాగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు హుస్సేమియావాగుకు వెళ్లే ఒర్రె కాలువను పూడ్చివేశారు. జేసీబీ సహాయంతో సదరు స్థలాన్ని రాత్రికిరాత్రే చదును చేశారు. విషయం తెలుసుకున్న దళితులు కొందరు స్థలం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. పట్టాభూమి అయితే ఇన్నాళ్లు ఎందుకు ఊరుకున్నారని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కావాలనే సమాధుల స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. విషయాన్ని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, కలెక్టర్ సంగీత దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. నిరసనలో బొడ్డు శంకర్, నర్సింగ్, చందర్, పర్వతాలు, బాపురావు, మల్లమ్మ, స్వప్న, లావణ్య, రాజేశ్వరి, పొన్నాల రవీందర్, తాండ్ర చందర్, కొత్తూరు నారాయణ, కొత్తూరు మణెమ్మ, కేతమ్మ, సునీత ఉన్నారు. వీరికి బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఆరెపల్లి రాకేష్, అంబేద్కర్ యువజన సంఘం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేపల్లి రాహుల్ సంఘీభావం తెలిపారు.

సంస్థ పురోభివృద్ధిలో యువ ఉద్యోగుల పాత్ర కీలకం



కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జీఎం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ పురోభివృద్ధిలో యువ ఉద్యోగుల పాత్ర కీలకమని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో 23 మంది యువ ఉద్యోగులకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీ–1 ఏరియాలో ఇప్పటివరకు 1,339 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఉద్యోగంలో చేరే యువత ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా పని నైపుణ్యాన్ని మెరుగుపరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రతి ఒక్కరూ వృత్తిపై అంకిత భావంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పొనగోటి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.